క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రచారం



మద్దిరాలపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న పాలడుగు రాజీవ్

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తామని జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ పాలడుగు రాజీవ్ అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగు నాగార్జున, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ గెలుపు కోసం బుధవారం రాత్రి నుంచి మద్దిరాలపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ పొందాలి

సంతనూతలపాడు (చీమకుర్తి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ నిర్వహించే పరీక్షకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సంతనూతలపాడు గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ఒంగోలు సెంట్రల్: సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా బైపాస్ బ్రిడ్జి కింద మజ్జిగ చలివేంద్రాన్ని ఎన్ఆర్ఐ శిల్పా రాఘవేంద్ర సహకారంతో ప్రారంభించినట్లు తెలిపారు. పాణకం, వడపప్పు, మజ్జిగ కేంద్రాలను ట్రస్ట్ సెక్రటరీ దంపతుల కుమార్తె మహీధీయ ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు రెండు నెలల పాటు ఈ కేంద్రం సేవలందిస్తుందని చెప్పారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ చైర్‌పర్సన్ షహనాజ్, మేడిశెట్టి సుబ్బారావు, ఇమ్రాన్, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

19న సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు పంచాయతీ దగ్గరలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో ముస్తాబవుతున్న పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామరాజ్యాన్ని తలపించేలా పరిపాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలనే ఆకాంక్షతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. దుంపా చెంచిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీరామనవమి వేడుకల్లో దుంపా ఇంద్రసేనారెడ్డి, కుంచాల నాగాంజనేయులు, బి.వెంకటరావు, డాక్టర్ శ్రీనివాసరావు, టీ శేషిరెడ్డి, వెంకటసుబ్బయ్య, షేక్ హుస్సేన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

251 కేసుల మద్యం స్వాధీనం

ముండ్లమూరు: మండలంలోని లక్ష్మీనగర్, ముండ్లమూరు, నాయుడుపాలెంలో బుధవారం అనధికారికంగా నిల్వ చేసిన 251 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నట్లు దర్శి ఎస్ఈబీ సీఐ సుందరరామయ్య తెలిపారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముండ్లమూరు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కారులోకి ఎక్కిస్తున్న 20 మద్యం కేసులు, నాయుడుపాలెంలో 10 మద్యం కేసులు, లక్ష్మీనగర్‌లో ఓ ఇంట్లో దాచిన 221 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసుల్లో ముండ్లమూరు మద్యం షాపులో పని చేస్తున్న షేక్ అంజిబాబు, యాదాల శ్రీనివాసరావు, పోలవరపు ఖాశింవలి, లక్ష్మీనగర్‌లో మద్యం నిల్వ చేసిన ఇంటి యజమాని పేరంరెడ్డి మాలకొండారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణం..కమనీయం



సీతారాముల కల్యాణం జరిపిస్తూ పీటలపై కూర్చున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు



బాలినేని నివాసంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కరవదిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు



గాదెపాలెంలో కోదండరామస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు

- ఎమ్మెల్యే బాలినేని ఇంటి వద్ద వైభవంగా సీతారాముల కల్యాణం
- రాములోరి కల్యాణం నిర్వహించిన బాలినేని దంపతులు
- పీటలపై కూర్చున్న ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు
- కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించిన వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి

ఒంగోలు సబర్బన్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు ఒంగోలు వీఐపీ రోడ్డులోని వారి నివాసంలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాలినేని నివాసంలో ప్రత్యేకంగా చలువ పందిళ్లు వేసి మరీ కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. బాలినేని నివాసంలో రాములోరి కల్యాణం కోసం ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి పీఠాన్ని నిర్మించారు. ఆ పీఠంపై శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ఉంచారు. బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు ఆశీనులై రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి బాలినేని దంపతులకు రక్షా బంధాలు ఒకరిచేత మరొకరి చేతులకు కట్టించారు. బాలినేని దంపతులతో పాటు ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు కూడా కల్యాణ వేదికపైనే ఆశీనులవగా, వారికి కూడా రక్షాబంధన్‌లు కట్టించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని దక్షిణామూర్తి బృందం ప్రారంభించింది. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ మానవ అవతారం ఎత్తిన ప్రతిఒక్కరూ యజ్ఞం చేయాలన్నారు. ఒకవేళ యజ్ఞం చేయలేకపోతే కనీసం చూడనైనా చూడాలని వివరించారు. వీటికి మించి మంచి పుణ్య కార్యక్రమం ఏదైనా ఉందంటే అది సీతారాముల కల్యాణమేనన్నారు. ఒకసారి సీతారాముల కల్యాణం చేస్తే 8 యజ్ఞాలు చేసినంత పుణ్యం వస్తుందని వెల్లడించారు. అనంతరం బాలినేని దంపతులు సీతారాములకు నూతన పట్టు వస్త్రాలు బహూకరించారు. అనంతరం కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం కల్యాణానికి హాజరైన భక్తులకు, ప్రజలకు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమానికి ఒంగోలు నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి విరివిగా మహిళలు, దంపతులు హాజరయ్యారు.

ఆలయంలో పూజలు చేసిన మంత్రి మేరుగు...

చీమకుర్తి: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం చీమకుర్తిలోని కొత్తకుమ్మరిపాలెంలో శ్రీసీతారామస్వామి ఆలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగు నాగార్జున పూజలు చేశారు. ఆలయంలోని స్వామి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్ సోమా శేషాద్రి, జీ ఓబుల్‌రెడ్డి, అమర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం...

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో వేణుగోపాలస్వామి, సీతారామచంద్రస్వామి, రామలింగేశ్వరస్వామి దేవస్థానాల్లో అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. 133వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత 9 రోజులుగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి పర్వదినాన సీతారాముని కల్యాణ మహోత్సవానికి పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేసిన పందిళ్లు నిండిపోయాయి. దేవస్థానం ఆలయ ఈవో బి.శ్రీనివాస్ దేవస్థాన అధికారి నాగరంగయ్య పర్యవేక్షణలో ట్రస్టీ మొక్కపాటి లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు హనుమాచార్యులు, రఘుప్రదీప్, కేశవాచార్యులు, టీవీ సుబ్బారావు వేదమంత్రాలు పఠిస్తుండగా భక్తుల శ్రీరామ నామస్మరణతో కల్యాణం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ పండితులు అక్షింతలు వేసి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక అయ్యప్ప సేవా సమితి, ఒంగోలులోని ప్రముఖ వైద్యశాలల వైద్యులు పానకం, పులిహోర అందజేశారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి మూడు దేవస్థానాల నుంచి స్వామి వార్ల గ్రామోత్సవాన్ని కరవది గ్రామ వీధుల్లో నిర్వహించారు. దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సీతారామస్వామి ఆలయాల్లో రాములవారి కల్యాణాన్ని బుధవారం శ్రీరామనవమి సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే సందడి నెలకొంది. మధ్యాహ్నం ఎండ వేడిమిని కూడా లెక్కచేయకుండా భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. అర్చకులు భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయగా, ఉభయదాతలు స్వామివారి కల్యాణానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలతో పాటు విసనకర్రలు అందజేశారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ కమిటీల నిర్వాహకులు వడపప్పు, పానకాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామివారి ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో బుధవారం భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో సీతారాములవారికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పండితులు, పురోహితులు వేద మంత్రాల మధ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అల్లూరు, ఆలూరు, మోటుమాల, గాదెపాలెం, పాదర్తి, కొత్తపట్నం, ఈతముక్కల, రంగాయపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు బారులుదీరారు. గాదెపాలెం శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో, మోటుమాల కోదండ రామస్వామి ఆలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలందుకున్నారు. కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ యూత్ మండల నాయకుడు ములకా రామిరెడ్డి, యల్లమందారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులకు తీర్థ ప్రసాదాలు, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. రంగాయపాలెంలో సీతారాములవారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు పాల్గొని తిలకించారు. సీతారాముల చరిత్ర గురించి పురోహితుడు వివరించారు. భక్తులు భజన పాటలు ఆలపించారు. కార్యక్రమంలో గాదెపాలెం కోదండరామస్వామి దేవస్థానం చైర్మన్ గాదె చంద్రశేఖర్‌రెడ్డి, కోడూరి బ్రహ్మారెడ్డి, శివకృష్ణ పాల్గొన్నారు.



చీమకుర్తిలో పూజలు చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



బాలినేని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భారీగా పాల్గొన్న భక్తులు

లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో శిద్దా దంపతుల పూజలు





ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, పద్మావతి దంపతులు, హాజరైన భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీరామనవమి సందర్భంగా ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా మందిరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు ప్రధాన కర్తలుగా సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు శ్రీరామ జయరామ నామాలు పఠిస్తూ కల్యాణాన్ని వీక్షించారు. బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో గడియారంవారివీధిలోని అనంత కోదండరామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పలువురు దంపతులు సామూహికంగా తలంబ్రాలు పోసి స్వామివారి సేవలో తరించారు. నిర్మల్‌నగర్ పార్క్ వద్ద స్థానిక భక్త బృందం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. చిన్నారులు, పెద్దలు, యువత, కమిటీ ప్రతినిధులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. స్థానిక సత్యనారాయణపురం దిబ్బలరోడ్డులోని అనంత కోదండరామస్వామి దేవస్థానంలో ఆలయ నిర్వాహకులు సీతారామ కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద, జిల్లా పరిషత్ కాలనీలో భక్తబృందం ఆధ్వర్యంలో, గాంధీనగర్ జెడ్పీకాలనీలో సత్యసాయిబాబా మందిరంలో, మర్రిచెట్లకాలనీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో, గాంధీరోడ్ అనంత కోదండరామస్వామి ఆలయం, గీతా మందిరం దగ్గర, బాపూజీ కాంప్లెక్స్, గాంధీరోడ్డు పత్తివారి వీధిలో, సంతపేట సాయిబాబా మందిరంలో, సంతపేట వీరాంజనేయస్వామి దేవస్థానంలో, సీతారాంపురం హిల్‌కాలనీ రామచంద్రస్వామి ఆలయంలో, నెల్లూరు బస్టాండ్, కర్నూల్ రోడ్, 60 అడుగుల రోడ్డు, అంజయ్య రోడ్డు, రాంనగర్, భాగ్యనగర్, ఐశ్వర్యనగర్, రాజీవ్‌నగర్, వీఐపీ రోడ్, కొణిజేడు బస్టాండ్, గద్దలగుంట, మామిడిపాలెం, మరాఠీపాలెం, తూర్పు కమ్మపాలెం, వెంకటేశ్వరనగర్ తదితర ప్రాంతాల్లో సీతారామస్వామి కల్యాణాలు నిర్వహించి అన్నదానాలు చేశారు.





ఒంగోలు నిర్మల్‌నగర్ పార్కు వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవంలో స్వామివారు, పాల్గొన్న భక్తులు

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

- అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడుకుందాం
- సామాజిక న్యాయం జగనన్నకే సాధ్యం కరపత్రం విడుదల
- దళిత సంఘ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు



కరపత్రాలు విడుదల చేస్తున్న దళిత సంఘ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు

ఒంగోలు సెంట్రల్: సామాజిక న్యాయం జగనన్నకే సాధ్యమని, వైఎస్సార్ సీపీ బలపరిచిన అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకుందామని దళిత సంఘ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం సామాజిక న్యాయం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించి అంధకారంలోకి నెట్టిందని, చంద్రబాబు విజన్ 2020 పేరుతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో జగనన్న రాత్రింబవళ్లు పాదయాత్రల ద్వారా రాష్ట్ర ప్రజలను చైతన్యపరిచి రాక్షస పాలన పాలద్రోలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు డీబీటీ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారన్నారు. పేద వర్గాలను ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కాపాడుకుంటూ గత 59 నెలలుగా ప్రభుత్వం నడిచిందన్నారు. నేడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు ఎత్తివేయాలని మోదీ కుట్రలు పన్ని అందుకు 400 సీట్లు సంపాదించడానికి టీడీపీ, జనసేన మద్దతు కట్టి ముందుకు వస్తున్నారని అన్నారు. గతంలో దళిత, గిరిజన, బహుజనులకు చేసింది ఏమీ లేకపోయినా మోసపూరిత హామీలతో మన ముందుకు ఓట్ల కోసం వస్తున్న చంద్రబాబు కూటమి, సవతి తల్లి ప్రేమతో వస్తున్న కాంగ్రెస్ కూటమి మోసాలని గమనించాలని కోరారు. ఆయా పార్టీల మోసాలని గుర్తించి ఓటు అనే ఆయుధంతో ఓడించి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిత్యం కృషి చేసిన సీఎం వైఎస్ జగనన్నకు మళ్లీ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చవల సురేష్, పైనం నాగరాజు, ముక్కల సురేష్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీతో పొత్తును జీర్ణించుకోలేక..

- టీడీపీకి రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కరిముల్లా రాజీనామా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కరిముల్లా

ఒంగోలు సిటీ: మతతత్వ బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తెలిపారు. బుధవారం స్థానిక కేబీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకర్ల సమావేశంలో కరిముల్లా మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పలు పార్టీల్లో వివిధ హోదాల్లో ఉద్యమాలు నిర్వహించానన్నారు. 2005 నుంచి ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం పాటుపడినట్లు తెలిపారు. 2014లో విభజన ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీలో చేరానన్నారు. టీడీపీ హయాంలో ఒక్క మైనారిటీ ఎమ్మెల్యేకి కూడా మంత్రి పదవి దక్కలేదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో మతతత్వ బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయానన్నారు. బీజేపీ కండువాను తన భుజంపై మోయడం ఇష్టం లేక టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన శ్రేయోభిలాషులతో చర్చించి రెండుమూడు రోజుల్లో తన రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తానని కరిముల్లా తెలిపారు.

ప్రత్యేక హోదాతోనే నవ్యాంధ్రకు న్యాయం



ఉప్పుగుండూరులో మాట్లాడుతున్న విమలక్క

నాగులుప్పలపాడు: ప్రత్యేక హోదాతోనే నవ్యాంధ్రకు తగిన న్యాయం జరుగుతుందని అరుణోదయ సాంస్కృతిక సంఘం గౌరవాధ్యక్షురాలు విమలక్క డిమాండ్ చేశారు. నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ప్రకటించాలని ప్రజా అజెండా చాటుతూ నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర బుధవారం ఉప్పుగుండూరు చేరుకుంది. ఈ సందర్భంగా లైబ్రరీ సెంటర్‌లోని కామ్రేడ్ మాదాసు కృష్ణమూర్తి విగ్రహానికి విమలక్కతో పాటు రాష్ట్ర నాయకులు కరీం, కర్ణాకుల వీరాంజనేయులు పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ 21 రోజుల పాటు సాగే జన చైతన్య యాత్రలో కండలేరు ముంపు గ్రామాలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు, దళిత కాలనీలో సమస్యలు తెలుసుకుంటూ కొనసాగి ప్రభుత్వానికి డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగాభవాని, భాస్కర్, రమేష్, పెంచలన్న తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం అభివృద్ధి అన్నా బాధ్యత



మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న అన్నా దుర్గాకుమారి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత అన్నా రాంబాబు తీసుకుంటారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు సతీమణి అన్నా దుర్గాకుమారి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె పట్టణంలోని వివిధ వార్డుల్లో బుధవారం పార్టీ నేతలతో కలిసి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ జెండాతోనే ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం వస్తుందని, వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4 సంవత్సరాల 10 నెలల కాలంలో కుల,మత, రాజకీయ బేధం లేకుండా ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర, జగనన్న తోడు, సున్నా వడ్డీ, ఆసరా, చేయూత, జగనన్న గోరుముద్ద, పథకాలను అందించారన్నారు. చిర్లంచర్ల లీలావతి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, రోజ్‌లిడియా, గుంటక వనజాక్షి, దారివేముల హర్షిత, దొడ్డ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక బలగాల ప్రదర్శన

దర్శి: స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో ప్రత్యేక బలగాల ప్రదర్శన బుధవారం ఆకట్టుకుంది. ఎన్నికల సందర్భంగా వారు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరుగుతాయని చెప్పడానికి ఈ ప్రదర్శనలు చేశారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ షమీఉల్లా, ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

- సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం టౌన్: వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18న గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎస్పీ బాలసుందరరావు, రెవెన్యూ, పోలీసు అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 100 మీటర్ల పరిధిలో పాటించాల్సిన నిబంధనలపై సిబ్బందికి సూచనలిచ్చారు. సబ్ కలెక్టర్ కార్యాలయం బయట భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. నామినేషన్లు దాఖలు పరిచేందుకు అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోనికి అనుమతిస్తారు.

ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్లు దాఖలు చేస్తారు. 26న నామినేషన్‌ల పరిశీలన జరుగుతుంది. 29 సాయంత్రం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.